## ఫెంగ్ షుయి

# గుమ్మం ఎదురుగా పడుకోరాదు



మనిషి పడుకునే విధానం కూడా అతని సౌభాగ్యాన్ని, శాంతిని నిర్దేశిస్తుంది. అయితే ఈ విషయం చాలామందికి తెలీదు. ఫెంగ్‌షుయిలో పడకకు చాలా ప్రాధాన్యత ఉంది. కొందరు ఇంట్లో వీధి గుమ్మానికి ఎదురుగా కాళ్ళు చాపి పడుకుంటూ ఉంటారు. గుమ్మం వైపు కాళ్లు చాపి పడుకోవడం అన్నది మరణశయ్యకు చిహ్నం. సాధారణంగా మృతుల భౌతిక కాయాలను ఇలాగే ఉంచుతుంటారు. అయితే బతికున్న వారు మాత్రం ఈ పద్ధతిలో పడుకోరాదు. నిదురపోయే సమయంలో తల కానీ, కాళ్లు కాని ద్వారానికి ఎదురుగా ఉండకుండా చూసుకోవాలి. అలా ఉన్నాయంటే వారిపైన తప్పకుండా చెడు ప్రభావం ఉంటుంది. ఈ చెడు ప్రభావానికి దూరంగా ఉండాలంటే గుమ్మానికి కుడి, లేదా ఎడమ వైపున పడకను ఏర్పాటు చేసుకోవాలి. అలా పడకను వేసుకునే సౌకర్యం లేనివారు గుమ్మానికి అడ్డంగా పడుకోవచ్చు. అంటే గుమ్మం వైపు తల కానీ, కాళ్లు కాని ఉండకుండా పడుకోవాలి. ఇలా చేయడం వలన నిద్రించే వారిపై చెడు ప్రభావం ఉండదు.

*

వారం వారం 'ఫెంగ్ షుయి' మీకోసం

# అదృశ్య హస్తం

కవిత

కొండమీద పడిపోయినవాడు వెనక్కిరాడు
అందులోనూ 'రుద్ర' కొండ కదా అసలు తిరిగిరాడు
తను నిలబడ్డ చోట కనుచూపు మేర
హరితవనం కావాలనుకున్నవాడు
చిగురులు కలగంటూ అక్కడే ఉండిపోతాడు
ఎప్పటికీ తిరిగిరాడు
దోసిలి పట్టినవాడికి పట్టని వాడికి కూడా
నీటి చుక్క అందిస్తానని
వాగ్దానం చేసినవాడు
వరుణుడితో జతకట్టినవాడు
ఆ కొండమీదే 'ముద్ద' అయినా
ఆనకట్టై నీటి ప్రవాహాన్ని ధారపోస్తాడేగానీ
కొండదిగిరాడు
కళ్లు మూతలు పడ్డా తన చల్లని చూపుతో
'రాజ'ధాని కేసి చూస్తూ స్నేహ హస్తం చాస్తాడేగానీ
శకలాలు శకలాలుగా విడివడ్డవాడు కొండదిగిరాడు
'రక్ష' బండ సాక్షిగా మట్టిలో 'ఆత్మకూరు'కు పోలేదు
తనను నమ్ముకున్న ప్రతివాడి కోసం
మళ్లీ కొత్తగా మొలకెత్తడానికి
ఊరికే నిద్రపోతున్నాడంతే!



**-పిఆర్ఎల్ స్వామి**

## 'సరసి'కత

వైశంపాయనుడు ఓ పెళ్లికి పెద్దగా వున్నాడు. పెళ్లిలో మాట రాకుండా వుండటానికి ఎవరికెవరు ఏం పెట్టాలో అన్నీ ముందే అగ్రిమెంటు రాసి పెట్టాడు.

పెళ్లయ్యాక పెళ్లి కూతుర్ని అత్తారింటికి పంపేటప్పుడు చీర సారెలతో బాటు ఓ ఊర కుక్కని కూడా తాడు కట్టి బలవంతంగా లాక్కొచ్చి, కార్లో కెక్కించారు.

ఇదేవిటని అడిగిన పెళ్లి కొడుకు తరపు వారితో అన్నారు ఆడపెళ్లి వారు "మీరు అగ్రిమెంటులో అడిగిన ప్రకారం తుచ తప్పకుండా అన్నీ ఇస్తున్నామండీ" అని.




అగ్రిమెంటు తీసి చూస్తే అందులో "శునకనక వస్తు వాహనాలతో మగ పెళ్లి వారిని సత్కరించ వలెను" అని చేతి రాతతో రాసిన కండిషన్ కనిపించింది.

పొరబాటు రాసిన వైశంపాయనుడు రెప్పపాటులో అక్కణ్ణించి మాయమైపోయాడు.

*

# ప్రపంచంలోని అతి పెద్ద బర్గర్...



పిజ్జా, బర్గర్ అంటే ఇష్టపడని యువత ఉండదు. భోజనం మానేసి బర్గర్లను మాత్రమే తినే వారు చాలా మందే ఉన్నారు. బర్గర్లంటే ఈనాటి యువతకి అంత పిచ్చి. ఎక్కువ మంది ఇష్టంగా తినే బర్గర్ తయారీలో రికార్డు సృష్టించాలనే ఆలోచన మిచ్‌గన్‌లోని సౌత్‌గేట్‌లో ఉన్న ఓ రెస్టారెంట్ ఓనర్‌కి వచ్చింది. తన ఆలోచనలకు వెంటనే శ్రీకారం చుట్టాడు. ప్రపంచంలోనే అతి పెద్ద బర్గర్‌ను తయారు చేసి రికార్డు సృష్టించాడు. దీనికి సంబంధించిన వివరాలు.....

సౌత్‌గేట్‌లోని రెస్టారెంట్ ఓనర్ స్టీవ్ మల్లై 84 కిలోల బర్గర్‌ను తయారు చేసాడు. దీని విలువ సుమారు 499 డాలర్లు. ఈ సందర్భంగా రెస్టారెంట్ ఓనర్ మాట్లాడుతూ, గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించాలనేది తన ఆశయం అన్నాడు. ఈ బర్గర్‌ను తయారు చేయడానికి సుమారు 15 గంటల సమయం పట్టినట్లు ఆయన వివరించారు.

☆